నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, శుక్రవారం 5 జూలై 2024 | PEDDAPALLI

## హుజూరాబాద్ దవాఖానకు ఎన్‌క్వాస్ అవార్డు




అవార్డును కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి అందజేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్యాధికారులు

విద్యానగర్, జూలై 4 : హుజూరాబాద్ ఏరియా దవాఖానకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అవార్డ్ (ఎన్‌క్యూఏఎస్)ను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అందించిందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాతతో పాటు వైద్యాధికారులు గురువారం కలెక్టర్‌ను కలిశారు. ఈ మేరకు కేంద్రం నుంచి అందుకున్న అవార్డును అందజేశారు. 95 శాతం అచీవ్‌మెంట్ సాధించినందుకు ఏరియా దవాఖాన అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే టాప్ 3లో నిలవడం కరీంనగర్‌కు గర్వకారణమని తెలిపారు. ఇక్కడ డీసీహెచ్‌ఎస్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# అధికారుల చేతుల్లోకి పాలన!






పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు స్పెషల్ ఆఫీసర్స్

- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు
- జనవరిలో ముగియనున్న మున్సిపల్ గడువు
- ఎన్నికల నిర్వహణకు అనేక అవరోధాలు
- ఆవిరవుతున్న ఆశావహుల ఆశలు

**పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు పాలనంతా అధికారుల చేతుల్లోకి వెళ్లింది. ఇప్పటికే ఐదు నెలలుగా పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తుండగా.. గురువారం నుంచి మండల, జిల్లా పరిషత్‌లలో అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని మండలాలకు ప్రత్యేకాధికారులను కలెక్టర్లు నియమించగా.. వారంతా గురువారమే బాధ్యత్యలు స్వీకరించారు. స్థానిక సంస్థల చట్టాల ప్రకారం ఎన్నికలు వెంటనే నిర్వహించాల్సి ఉన్నా.. ఇప్పట్లో అవి జరిగేలా లేవు. అసలు ఎప్పుడు జరుగుతాయన్న దానిపైనా ప్రభుత్వం స్పష్టతనిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతోపాటు ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరుగుతాయా..? లేక మారుతాయా..? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. దీంతో ఆశావహుల ఆశలు ఆవిరవుతుండగా, స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలనే డిమాండ్ మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నది.**

కరీంనగర్, జూలై 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఫిబ్రవరి ఒకటి నుంచే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని 1,214 గ్రామ పంచాయతీల్లో ఐదు నెలలుగా కొనసాగుతున్నది. అయితే, పాలన అంతంత మాత్రంగానే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతుండగా, పాలకవర్గాలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నదని ప్రజలు చెబుతున్నారు. అలాగే, గురువారం నుంచి ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవీ కాలం గురువారమే (జూలై 4న) ముగియగా.. ప్రభుత్వ ఆదేశాలతో అన్ని మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ బుధవారం రాత్రే ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్పెషల్ అధికారులు బాధ్యతలు స్వీకరించారు. పల్లె నుంచి మొదలుకొని జిల్లా పరిషత్ వరకు పాలన అంతా అధికారుల చేతుల్లోకి వెళ్లిపోయినట్టయింది.

### ఆదేశాలు ఇచ్చి ఆపై ఆపేసి?

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం గతేడాది డిసెంబర్‌లోనే ఆదేశాలు జారీ చేసింది. జీపీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి ఒకటితో పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని అప్పట్లోనే కలెక్టర్లకు ఆదేశాలు (లెటర్ నంబర్ 921/టీఎస్ఈసీ–పీఆర్/2023) జారీ చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను తాజాగా విడుదల చేసింది. అక్కడితో ఆగకుండా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో..? వారికి తగ్గట్టుగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను ఎంతమందిని నియమించాలో నిర్దేశిస్తూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నిబంధనల మేరకు చూస్తే.. రాజ్యాంగంలోని 243(3)(ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘమే తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కానీ, రిజర్వేషన్లు, బీసీ జనాభా గణన వంటి అంశాలు తేలకపోవడంతో పంచాయతీ ఎన్నికలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ. చైర్మన్లు, పంచాయతీల వివరాలు జిల్లాల వారీగా..**

| జిల్లా | ఎంపీటీసీలు | ఎంపీపీలు | జడ్పీటీసీలు | చైర్మన్లు | పంచాయతీలు |
|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 178 | 15 | 15 | 1 | 313 |
| పెద్దపల్లి | 138 | 13 | 13 | 1 | 263 |
| సిరిసిల్ల | 123 | 12 | 12 | 1 | 255 |
| జగిత్యాల | 214 | 18 | 18 | 1 | 383 |

### అదే సందిగ్ధత

పంచాయతీల్లో ఫిబ్రవరి ఒకటి నుంచే ప్రత్యేక పాలన నడుస్తున్నది. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి. అందుకోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం ఆచరణలోకి తేవాలి. కానీ, ఆనాటి నుంచి నేటి వరకు అధికారుల పాలనే కొనసాగుతున్నది. లోతుగా చూస్తే 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ సుప్రీంకోర్టు పలు ఆదేశాలు ఇచ్చింది. ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లను అప్పటి పంచాయతీరాజ్ అధికారులు ఖరారు చేశారు. బీసీలకు 22.79 శాతం, అలాగే ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు జరిపారు. అయితే, వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతుల్లో సర్పంచ్ ఎన్నికలు అప్పట్లో నిర్వహించగా, చాలా రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చారు. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ డెడికేటెడ్ కమిషన్ (మన రాష్ట్రంలో బీసీ కమిషన్) నియమించాలని సూచించింది. సదరు కమిషన్ పూర్తి అధ్యయనం చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు ఇవ్వాలని చెబుతూనే, ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించొద్దని స్పష్టం చేసింది. అంటే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలంటే.. బీసీ రిజర్వేషన్లు తేల్చాల్సిన అవసరమున్నది. ఇవి తేలాలంటే బీసీ కులగణన అయినా జరగాలి, లేదా ఓటర్ల ప్రాతిపదికన వివరాలు సేకరించి రిజర్వేషన్లు కల్పించాలి. అది కూడా 50 శాతం లోపే ఉండాలి.

### తేల్చని సర్కారు

అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రస్తుతం సమస్యగా మారుతున్నది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అంతే కాకుండా కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని చెప్పింది. తద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని, బీసీ వర్గాల్లో ఉపకులాల వారీగా వర్గీకరణ చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేస్తామని బీసీ డిక్లరేషన్‌లో స్పష్టం చేసింది. అయితే, ఓవైపు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దు. మరోవైపు బీసీ కులగణన జరగాలి. వీటిపై ప్రభుత్వం ఇప్పటి వరకు బీసీ కమిషన్‌కు స్పష్టత ఇవ్వలేదు. ఈ పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా కనిపించడం లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న నేతలు ఇప్పట్లో నెరవేరే అవకాశం లేదు. ఇవన్నీ చూస్తే ప్రత్యేకాధికారుల పాలన ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేని పరిస్థితి ఉన్నది.

# ₹64 లక్షల బిల్లుకు ₹15 లక్షలు లంచం!

- ధాన్యం కొనుగోళ్ల కమీషన్ చెల్లింపు కోసం డీసీఎంఎస్ మేనేజర్ డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- ₹లక్ష నగదు తీసుకుంటుండగా మేనేజర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పట్టివేత



మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తీసుకున్న నగదును లెక్కిస్తున్న ఏసీబీ అధికారులు

**ఏసీబీ వలలో భారీ తిమింగళమే పడింది. లంచం డిమాండ్ చేసి అడ్డంగా చిక్కింది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ₹64 లక్షల కమీషన్ చెల్లించేందుకు మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు ఏకంగా ₹15 లక్షల లంచం డిమాండ్ చేశాడు. తప్పని పరిస్థితుల్లో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఆ అధికారులు రంగంలోకి దిగారు. గురువారం బాధితుడి నుంచి ₹లక్ష తీసుకుంటుండగా మేనేజర్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ సుధగోని కుమారస్వామిని పట్టుకున్నారు. అనంతరం డీఎస్పీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు.**

కరీంనగర్ రాంనగర్, జూలై 4 : ఓదెల మండలం ఇందుర్తికి చెందిన కావటి రాజు డీసీఎంఎస్ అనుసంధానంతో తన గ్రామంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాడు. 2018 నుంచి వడ్లు కొనుగోలు చేసిన రాజు, సివిల్ సప్లయి అధికారులు చెప్పిన చోటుకు ఎప్పటికప్పుడు పంపించాడు. వీటికి సంబంధించి 2018 నుంచి వడ్ల కొనుగోలు కమీషన్ ₹90,16,650 డీసీఎంఎస్ నుంచి రాజుకు రావాల్సి ఉన్నది. అప్పటి నుంచి డీసీఎంఎస్ ఆఫీస్ చుట్టూ తిరిగినా మేనేజర్ వెంకటేశ్వర్‌రావు డబ్బులు చెల్లించలేదు. డబ్బులు ఇవ్వడం కుదరదని ఎరువుల బస్తాలు పంపిస్తామని సలహా ఇచ్చాడు. ఎరువుల బస్తాలకు కమీషన్ వస్తుందని ఆశతో సుమారు ₹26 లక్షల విలువైన ఎరువులు కొద్ది రోజుల క్రితం పంపించాడు. దీనికి కూడా 13 శాతం కమీషన్ వెంకటేశ్వర్‌రావే తీసుకున్నాడు. రాజు తనకు రావాల్సిన మిగతా ₹64లక్షల కమీషన్ డబ్బుల కోసం తిరుగుతున్నా మేనేజర్ డబ్బులు ఇవ్వడం కుదరని, డబ్బుల కింద మరో 15 లోడ్‌ల ఎరువుల బస్తాలు పంపిస్తానని చెప్పాడు. దీంతో చేసేదేమీ లేక ఎరువుల బస్తాలు తీసుకునేందుకు రాజు అంగీకరించగా, ఒక్కో లోడ్‌కు ₹లక్ష నగదు ఇస్తేనే పంపిస్తానని షరతు విధించాడు. వెంకటేశ్వర్‌రావు బాధ భరించలేక రాజు ఈనెల ఒకటిన ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు నిఘా వేశారు. గురువారం మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తమ కార్యాలయంలోని ఛాంబర్‌లో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకుని రసాయనిక పరీక్షలు నిర్వహించగా లంచం తీసుకున్నది వాస్తవం కావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందిని విచారించి, రికార్డులను పరిశీలించారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇద్దరిని విచారణ అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వివరించారు.

## తాగినంత తాగి.. మిగతాది అమ్ముతూ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, జూలై 4 : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అడ్డంగా దొరికిపోయారు. రెండు కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ రఘుచందర్ గురువారం ధర్మపురి సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన బత్తిని చందు, గొల్ల వెంకటేశ్ గంజాయికి బానిసయ్యారు. ఈ క్రమంలో తక్కువ ధరకు ఎక్కువ గంజాయిని కొని అవసరమైనంత తాగి, మిగతాది ఎక్కువ ధరకు అమ్ముకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం కరీంనగర్‌కు చెందిన రాము అనే వ్యక్తిని కలిశారు. ఇద్దరూ కలిసి రాము వద్ద గంజాయిని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. వారికి సరిపోయేంత తాగి, మిగతాది గ్రామాల్లో తిరుగుతూ యువకులకు విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించే క్రమంలో బుధవారం సాయంత్రం చందు తన బైక్ సీట్ కింద, వెంకటేశ్ తన బైక్ ట్యాంక్ కవర్లో గంజాయిని తీసుకొని ధర్మపురి వైపు వస్తున్నారు. పట్టణ శివారులో డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో అప్పటికే నిఘా వేసి ఉన్న సీఐ రామ్‌నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, వెంకటయ్య, రామస్వామి, కానిస్టేబుళ్లు రమేశ్, నవీన్‌కుమార్, రమేశ్‌నాయక్ నిందితులను పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.



బకెట్ నీళ్లతో ప్లేట్లను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

## చేతులు కడగడానికే నీళ్లు లేవ్!

- లక్కారం జడ్పీహెచ్‌ఎస్‌లో కటకట
- విద్యార్థులకు ఇబ్బందులు

ముత్తారం, జులై 4 : లక్కారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు కొద్ది రోజులుగా నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. బోరు అడుగంటడంతో నీళ్లు లేక గోస పడుతున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కనీసం చేతులు, తిన్న ప్లేట్లు శుభ్రపరిచేందుకు తిప్పలు పడుతున్నారు. గురువారం విద్యార్థుల ఇబ్బందులను గమనించిన ఓ స్థానికుడు స్కూల్ బయట బకెట్, బిందె ద్వారా నీళ్లందించాడు. కాగా, విద్యార్థులు నీటి కష్టాలు ఎదుర్కోవడంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు బాత్ రూం వెళ్లే సమయంలోనూ నీళ్లు లేని దుస్థితి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థి నాయకుల అరెస్ట్

కరీంనగర్ తెలంగాణచౌక్, జూలై 4: ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డిని గురువారం రాత్రి కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిరుద్యోగ ర్యాలీకి వెళ్తారనే సమాచారంతో ముందస్తుగా సీపీఐ కార్యాలయంలో ఉన్న మణికంఠతో పాటు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కార్యదర్శి యుగేందర్‌ను అదుపులోకి తీసుకొని వన్ టౌన్ ఠాణాకు తరలించారు. కాగా, మణికంఠరెడ్డి మాట్లాడుతూ, శుక్రవారం ఎలాంటి నిరసన కార్యక్రమాలు లేకున్నా ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు.



కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి నాయకులు




పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

పెద్దపల్లి, జూలై 4: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రోడ్డెక్కారు. 65ఏళ్లు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, సమ్మె హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశ పడితే సీఎం రేవంత్‌రెడ్డి నిండా ముంచారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే రిటైర్మెంట్ బెనిఫిట్స్ సొమ్ము పెంచుతామని నమ్మించి మోసం చేశారని, మెమో పేరుతో బలవంతంగా ఇంటికి పంపించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 6 నుంచి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ గేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జీ జ్యోతి మాట్లాడుతూ, రాష్ట్రంలో 65ఏళ్లు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సుమారు 10వేల మంది దాకా ఉన్నారన్నారు. జీవో నంబర్ 10 ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు ₹లక్ష, హెల్పర్లకు ₹50వేలు ఉండేదని, ఆ మొత్తాన్ని పెంచాలని గతేడాది సెప్టెంబర్‌లో తాము నిరవధిక సమ్మె చేశామని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం టీచర్లకు ₹2లక్షలు, హెల్పర్లుకు ₹లక్షకు పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పాత జీవో 10 ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని మెమో జారీ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 40 ఏండ్లుగా సేవలందించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను అవమానించేలా రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేయడం అన్యాయమని వాపోయారు. దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని, టీచర్లకు ₹2 లక్షలు, హెల్పర్స్‌కు ₹లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఆర్ కమలేష్, సుభాషిని, సత్యమ్మ, లక్ష్మి, శాంత, నరసమ్మ, ఉదయశ్రీ, షరీఫా, రాజమ్మ విశాలాక్షి, సీపీఎం నాయకుడు సీపెల్లి రవీందర్ పాల్గొన్నారు.



## ఐటీఐల్లో రెండో దఫా ప్రవేశాలు

కమాన్‌చౌరస్తా, జూలై 4 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో దఫా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఎన్‌సీబీటీ ప్యాట్రన్ క్రింద వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం పొందవచ్చాన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ http://iti.telangana.gov.in ద్వారా రూ. 100తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన సూచించారు. ఈ అవకాశం జూలై 15 వరకు ఉందని చెప్పారు.






పెచ్చులూడిన భవనం పై కప్పు

## పెచ్చులూడుతున్నయ్

కోరుట్ల, జూలై 4: కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరుకున్నది. చినుకు పడితే చెత్తు పైభాగం నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతున్నది. పైభాగం కూలిపోయే స్థితికి వచ్చింది. పై నుంచి పెచ్చులూడుతున్నది. పట్టణానికి విద్యుత్ సరఫరా చేసేందుకు 24 గంటల పాటూ ఉద్యోగులు పని చేసే ఈ కార్యాలయంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ఫీడర్, పవర్ ట్రాన్స్‌ఫర్ కంట్రోలింగ్, కన్జ్యూమర్ ఫిర్యాదులు స్వీకరించే భవనం దర్వాజాలు, కిటికీలు ధ్వంసమై, వర్షపు నీరు లోనికి చేరి దుర్భరంగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారు.

## ఇద్దరు పిల్లలు.. ఆరుగురు టీచర్లు

- ఇదీ కిష్టంపేట జడ్పీ స్కూల్ దుస్థితి



కిష్టంపేట జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ నాగం కుమార్

చందుర్తి, జూలై 4: అది కిష్టంపేటలోని జిల్లా పరిషత్ పాఠశాల. ఒకప్పుడు బాగానే నడిచింది. కానీ, క్రమంగా ఆదరణ కోల్పోతూ వస్తున్నది. ఈ విద్యాసంవత్సరంలో పిల్లల సంఖ్య రెండుకు చేరింది. అయితే టీచర్లు మాత్రం ఆరుగురు ఉన్నారు. పొద్దున వస్తూ, తరగతి గదుల్లో కాలక్షేపం చేస్తూ సాయంత్రానికి ఇంటికెళ్తున్నారు. పిల్లలు సంఖ్య తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు రోజుకు ఇద్దరి చొప్పున వంతులవారీగా పాఠశాలకు వస్తున్నారనే ఆరోపణలున్నాయి. గురువారం చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించగా.. ఉదయం 9:45గంటలైనా తలుపులు తెరుచుకోలేదు. అటెండర్ తాపీగా వచ్చి తలుపులు తెరువగా, 10 గంటలు దాటిన తర్వాత ముగ్గురు టీచర్లు స్కూల్‌కు వచ్చారు. హెచ్‌ఎంతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు రాలేదు. పిల్లలేని స్కూల్లో ఉపాధ్యాయులు ఏం చేస్తారని? వారిని ఇతర పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపాలని డీఈవోకు జడ్పీటీసీ విజ్ఞప్తి చేశారు. కాగా, జిల్లాలోని మెజార్టీ స్కూళ్లలో సరిపడా టీచర్లు లేకుండా బోధనకు ఇబ్బందులు అవుతుండగా, ఇక్కడ ఇద్దరు పిల్లలకు ఆరుగురిని నియమించి, ప్రజా ధనాన్ని వృథా చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం వెంకటేశ్వర్లను సంప్రదించగా.. తాను ఎస్టీవో బిల్స్ కోసం వెళ్లినట్టు చెప్పారు. ఒక ఉపాధ్యాయురాలు లాస్ట్ పే సర్టిఫికెట్ (ఎల్పీసీ) కోసం వెళ్లిందని, మరో ఉపాధ్యాయుడు పుస్తకరూప సమీక్షకు వెళ్లారన్నారు.

